# సాగు రైతు అప్పుల కుప్పలు తరిగేదెన్నటికీ ?

## (23 డిసెంబర్ "జాతీయ రైతు దినోత్సవం" సందర్భంగా)

తెలంగాణలో కష్టాల వరి కుప్పల పోరు ఒకవైపు, దిగుబడులు పలుచబడి అప్పుల కుప్పలు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి. పంటల దిగుబడి కష్టాలతో పాటు అమ్మకాలకు కుప్పల వద్ద పడిగాపులు తిప్పలు. ఏకాకి అయినాడు అన్నదాత. రైతే రాజు, కర్షకుడే దేశానికి వెన్నెముక అన్న మాటలు నీటి మీద రాతలైనాయి. హలధారి ముంగిట హాలాహలమే పరిష్కారంగా తోస్తున్నది. కర్షకుడంటే అప్పుల చిరునామా, అందరికీ సులభంగా దొరికిన అమాయకజీవి. పురుగు మందులను ఆశ్రయించే నిర్భాగ్యులు. అతివృష్టి, అనావృష్టి విపత్తులే అతని నిత్య శత్రువులు. అన్నం పెట్టే వాడికే సున్నం పెట్టే రోజులు. సమస్యల సంసారంలో చెమటలే పెట్టుబడుల ధారలు. ఆకలిని దిగమింగి, లోక ఆకలిని తీర్చగల దైవ స్వరూపులు రైతులే. మానవాళి కంచంలో రుచులు వడ్డించే రైతులే గ్రామదేవత సమానులు. మట్టిని నమ్మే గట్టి మనుషులు. నీతి నియమ కవచ అమాయక జీవులు. దేశాభివృద్ధిని నిర్ణయించే నిరక్షరాస్య కర్షకులు. శ్రమను నమ్మిన కర్షకుడు. విత్తనాల కొరతలు, నకిలీ విత్తనాల మెొలకలు, ఎరువులకు క్యూ కట్టడాలు, చుక్కల్లో నకిలీ పురుగు మందుల ధరలు, పెట్టుబడి దాటని ఆదాయాలు, అప్పులతో సంసారాలు, వర్షాభావాలు, కరువు కాటకాలు, మధ్యవర్తుల అక్రమాలు, వరదల్లో కొట్టుకుపోయే ఆశల పంటలు, మార్కెట్ మాయాజాలాలు, మార్కెటింగ్ సౌకర్యాల లేమిలు, కాగితాలకు మాత్రమే పరిమితమైన మద్దతుధరల అకలాలు, అడుగంటిన కలల సంసారాలు లాంటి అనంత కష్టాలతోనే చిక్కి శల్యమవుతున్నారు కర్షక లోకం. రైతంటే అనాథ. రైతు పక్షాన నిలబడే నాథుడే కరువు.

### కిసాన్ దివస్:

గత 10,000 ఏండ్లుగా అత్యంత పురాతన వృత్తిగా వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా ఎదిగిన నాగరిక నవ నర సమాజమిది. దాదాపు 80 శాతానికి పైగా గ్రామీణ భారతం వ్యవసాయ రంగం పునాదిగానే నడుస్తున్నది. దేశ జిడిపీలో 15 శాతం వ్యవసాయ రంగమే సహకరిస్తున్నది. రైతుల ప్రాధాన్యతను, పరిరక్షణను మరిచిన సమాజం జీవచ్ఛవం అవుతుందని గమనించిన ప్రభుత్వాలు వ్యవసాయం పట్ల యువతకు, సాధారణ పట్టణ ప్రజలకు అవగాహన పరిచే క్రమంలో భాగంగా మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జన్మదిన రోజున ప్రతి ఏట 23 డిసెంబర్‌న 'జాతీయ కర్షక దినోత్సవం లేదా కిసాన్ దివస్'ను నిర్వహిస్తున్నది. ప్రపంచ దేశాల్లో 3వ అతి పెద్ద వ్యవసాయ ఉత్పత్తులను అందిస్తున్న దేశంగా భారత్ నిలుస్తున్నది. వ్యవసాయ ఉత్పత్తుల్లో ఇండియాతో పాటు అమెరికా, చైనా, బ్రెజిల్, రష్యాలు ముందు వరుసలో ఉన్నాయి. భారతంలో పంజాబ్, హర్యానా, యుపీ, యూపీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లాంటి రాష్ట్రాల వ్యవసాయ ఉత్పత్తులకు మంచి పేరుంది.

### రైతు పక్షపాతి చౌదరి చరణ్ సింగ్:

23 డిసెంబర్ 1902న హపూర్ జిల్లా యూపీలో రైతు కుటుంబంలో జన్మించిన చౌదరి చరణ్ సింగ్, చిన్నతనం నుంచే మోహన్‌దాస్ గాంధీతో ప్రేరణతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు పాలు కూడా అయ్యారు. 1937లో యంయల్ఏగా ఎంపికై రైతు పక్షపాతిగా పలు సమస్యలకు పరిష్కారం చూపారు. యూపీ రెవెన్యూ శాఖ మంత్రిగా భూసంస్కరణల చట్టం తీసుకు వచ్చారు. 1970లో యూపీ ముఖ్యమంత్రిగా, 1977–78 కేంద్ర హోం శాఖ మంత్రిగా, 1979లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా, 1979లోనే 3వ ఉప ప్రధాన మంత్రిగా సేవలు అందించిన చరణ్ సింగ్ దేశ 5వ ప్రధాన మంత్రిగా 1979–80 మధ్య అమూల్య రైతు చట్టాలను తీసుకువచ్చారు. రైతు నాయకుడిగా ప్రజాదరణ పొందిన చరణ్ సింగ్ 29 మే 1987న తుది శ్వాస విడిచి, 'కిసాన్ ఘాట్'లో శాశ్వత నిద్రలోకి జారుకున్నారు.

### వ్యవసాయ అనుబంధ రంగాలు:

రైతు ఇల్లు సుభిక్షంగా ఉన్న దేశమే సౌభాగ్యాల కోవెలని భావించాలి. మానవ నాగరికత వికాస ఏకైక మాధ్యమం వ్యవసాయరంగమే. వ్యవసాయంతో అనేక అనుబంధ రంగాలు ఆధారపడి ఉన్నాయి. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, హార్టికల్చర్, పశు సంవర్ధక శాఖ (ఆనిమల్ హస్బెండ్రీ), సామాజిక అటవీశాఖ, నేల పరిరక్షణ, నీటి వనరుల కల్పన, మత్స్య పరిశ్రమ, పశు సంపద, ఫుడ్ ప్రాసెసింగ్, బ్రివరేజెస్, వస్త్ర పరిశ్రమ, లెదర్ ఉత్పత్తులు, ఎరువులు/పురుగు మందుల పరిశ్రమలు లాంటి అనేక రంగాలు వ్యవసాయ అనుబంధ రంగాలుగా గుర్తింపు పొందాయి.

### నిరక్షరాస్య సాగు శాస్త్రవేత్త కర్షకుడే:

ఊరికి ఊపిరులూదేది నాగలి. బతుకు బండి చక్రాలు కర్షకులే. వ్యవసాయమే ఓ పవిత్ర వృత్తి. మట్టిని మాణిక్యంగా మార్చగల నేర్పరి రైతే. పంట చేనుతో మాట్లాడడం తెలిసిన అపర మేధావి కర్షకుడు. చేనుకు పట్టిన చీడపై యుద్ధం చేయగల సాహస వైద్యుడు. మట్టి వాసన, మెొలక చిగుర్ల చిరునవ్వులు, పాల కంకి పరువాలు, పండులో రుచి రసాలు నింపిన శ్రమజీవి, పంట దిగుబడిని అంచనా వేయగల నిరక్షరాస్య శాస్త్రజ్ఞుడు కర్షకుడు మాత్రమే.

రైతుకు సమస్త సౌకర్యాలను అందించి, వ్యవసాయం దండగ కాదు, పండగని అని నినదించాలి సమస్త మానవ సమాజం. కర్షకుడి కృషికి చేయూతి పట్టాభిషేకాలు. రైతే రాజని పెట్టాలి కోటి దండాలు.

జై జవాన్ ; జై కిసాన్ ; జై విద్వాన్.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## స్థానిక మార్కెట్ రోడ్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

మెదక్, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): స్థానిక మార్కెట్ రోడ్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం నందు ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ జర్దోషి, మొబైల్ సర్వీసింగ్ అండ్ రిపేర్, సిసి టివి రిపేర్ అండ్ అమరిక కోర్సుల నందు 3 నెలల కాలానికి శిక్షణకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి ఇది మూడవ బ్యాచ్ అని, ఈ బ్యాచ్ లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుకు 7వ తరగతి ఉతీర్ణులై ఉండాలని ఇందులో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. అదేవిధంగా మొబైల్ సర్వీసింగ్ నందు 15 సీట్లు, సిసి టివి రిపేర్ నందు 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇందుకు 10 వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 3 నెలల శిక్షణా కాలానికి 1500 రూపాయలు కోర్సు ఫీజు చెల్లించవలసి ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24 న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి పూర్తి చేసిన పిదప పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ పరంగా సర్టిఫికెట్ అందించడం జరుగుతుందని నాగరాజ్ పేర్కొన్నారు. వివరాలకు 9347344440 లేదా 9493594388 మొబైల్ నెంబర్లకు సంప్రదించవలసినదిగా ఆయన సూచించారు.

## రైతులకు ఇళ్ల స్థలాలు సిద్ధం చేయండి



మెదక్, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి):మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కు భూములు అప్పగించిన రైతులకు ఇళ్ల స్థలాలు అందజేయుటకు గుర్తించిన స్థలాన్ని చదును చేసి ఇళ్ల స్థలాలను అందజేయుటకు వీలుగా హద్దులు ఏర్పాటు చేసి సిద్ధం చేయవలసినదిగా అదనపు కలెక్టర్ రమేష్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామాత్యుల ఆదేశాల మేరకు గురువారం ముప్పిరెడ్డిపల్లి గ్రామా శివారులోని టీఎస్ ఐ ఐ సి స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశ్రమల ఏర్పాటు కోసం గతంలో సేకరించిన అసైన్డ్ భూముల నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు 400 ఇళ్ల పట్టాలు ఇచ్చుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం తూప్రాన్ మునిసిపల్ పరిధిలోని అల్లాపూర్ శివారులో ఐదున్నర కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న గ్రేయిన్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులను మార్కెటింగ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ తో కలిసి పరిశీలించారు. నిర్మాణం చివరి దశకు వచ్చిన పనులను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరునాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యకమంలో తహశీల్దార్ బిక్షపతి, మార్కెటింగ్ అధికారి రియాజ్ అహ్మద్, మార్కెటింగ్ శాఖ డీఈఈ మాధవ రెడ్డి, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.






## జిహెచ్ఎంసి ద్వారా 10.22 కోట్ల మంది ఆకలి తీర్చిన అన్నపూర్ణ భోజన పథకం

హైదరాబాద్, డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆకలితో ఎవ్వరూ అలమటించకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా 5 రూపాయలకే భోజనం అందించే అన్నపూర్ణ పథకం ద్వారా 10 కోట్ల 22 కోట్ల మందికి పైగా భోజనం అందించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న 5 రూపాయల అన్నపూర్ణ భోజన పథకం నగరంలో నిరుపేద ప్రజల ఆకలి ని తీరుస్తుంది. మార్చి 1, 2014న 8 కేంద్రాలతో ప్రారంభమైన ఈ పథకం తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల అవసరాలను గుర్తించిన 150 కేంద్రాలకు పెంచేసింది. హైదరాబాద్ నగరానికి ఆయా పనులు, వివిధ వృత్తులు చేసుకునేందుకు నగరానికి వచ్చిన వారే కాకుండా విద్యార్థులకు, నిరుద్యోగులకు అన్నపూర్ణ పథకం ఆసరగా నిలుస్తోంది. ఆకలి తో ఎవ్వరూ ఉండకూడదనే మంచి ఉద్దేశ్యంతో ఉమ్మడి రాష్ట్రంలో 8 కేంద్రాలు ఏర్పాటు చేసిన అన్నపూర్ణ పథకం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని 150 కేంద్రాల వరకు పెంచి ప్రతి కేంద్రం ద్వారా రోజుకు 300 భోజనాలు అందించాలని లక్ష్యంగా ఒక రోజుకు మొత్తం 45 వేల భోజనాలు అందించే ఏర్పాటు చేశారు. 2014 నుండి ఇప్పటివరకు నవంబర్ 2022 వరకు 198 కోట్ల 43 లక్షల రూపాయల ను ఖర్చుచేసి 10 కోట్ల 22 లక్షల 61 వేల 922 మందికి రూ. 5 లకే భోజనం అందజేయడం జరిగింది. ప్రారంభ సంవత్సరంలో కేవలం 9 లక్షల 12 వేల 685 మందికి లబ్ధి చేకూర్చగా ఒక్కొక్క సంవత్సరం పెరుగుతూ పోతుంది. అయినా ఖర్చుకు వెనుకాడకుండా పేదలకు లబ్ధి కూర్చడం ధ్యేయంగా జిహెచ్ఎంసి విశేష కృషి చేస్తున్నది. 2014-15 సంవత్సరం లో 9,12,685 మందికి వంపిణీ చేశారు. 2915-16 సంవత్సరం లో 27,12, 046,2016-17 సంవత్సరం లో 38,49,620,2017-18 సంవత్సరం లో 95,59,676,2018-19 సంవత్సరంలో 1,03,06,590,2019-20 సంవత్సరం లో 89,63,665,2020-21 సంవత్సరం లో 2,29,46,080,2021-22 సంవత్సరం లో 3,66,87,830,2022-23 నవంబర్ వరకు 63,23,730 మంది లబ్ధి పొందారు. కరోనా సమయంలో ఉచితంగా భోజనం అందించారు. కరోనా సమయంలో రవాణా సౌకర్యం లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ప్రభుత్వం మానవీయ కోణం తో ఆలోచించి ఉచితంగా భోజన వసతి కల్పించడం జరిగింది. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా నిర్ణయం తీసుకొని ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ప్రభుత్వ ఖర్చుతో వారి సొంత గ్రామాలకు పంపించే ఏర్పాటు చేశారు.

ప్రయాణ సమయంలో వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారి గ్రామానికి చేరుకునే వరకు కావాల్సిన పండ్లు, భోజనం, త్రాగు నీరు, సౌకర్యం కల్పించిన ఘనత ఈ రాష్ట్రానికే దక్కుతుంది. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి వ్యాప్తంగా శాశ్వతంగా ఉన్న కేంద్రాలతో కలిపి మొత్తం 373 కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా రాత్రి సమయంలో కూడా భోజనం అందించేందుకు 259 మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పీరియడ్ లో మొత్తం 2 కోట్ల 29 లక్షల 46 వేల 80 మందికి ఉచితంగా డిన్నర్ అందించడం జరిగింది. కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రత్యేక చర్యల వలన దేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది .

## కవలూరులోని వైను బప్పు అబ్జర్వేటరీలో 40 అంగుళాల టెలిస్కోప్ యొక్క ఖగోళ నక్షత్ర ఆవిష్కరణలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 22:తమిళ నాడులోని కావలూర్‌లోని వైను బప్పు అబ్జర్వేటరీలో 40-అంగుళాల టెలిస్కోప్ యొక్క అనేక ఖగోళ నక్షత్రాల ఆవిష్కరణలు డిసెంబర్ 15-16న 50 సంవత్సరాల స్వర్ణోత్సవాల వేడుకలో ప్రధాన ఆకర్షణ గా నిలిచాయి.

ప్రొఫెసర్ వైను బప్పు ఏర్పాటు చేసిన టెలిస్కోప్ యురేనస్ గ్రహం చుట్టూ వలయాలు ఉండటం, యురేనస్ యొక్క కొత్త ఉపగ్రహం, బృహస్పతి ఉపగ్రహమైన గనిమీడ్ చుట్టూ వాతావరణం ఉండటం వంటి ప్రధాన ఆవిష్కరణలతో ఖగోళ శాస్త్రంలో గణనీయమైన పాత్ర పోషించింది. ఈ టెలిస్కోప్‌తో నిర్వహించబడిన ఇతర ముఖ్యమైన పరిశోధనలలో అనేక 'బి స్టార్స్' యొక్క ఆవిష్కరణ మరియు అధ్యయనం, జెయింట్ స్టార్‌లలో లిథియం క్షీణత, బ్లేజర్‌లలో ఆప్టికల్ వేరియబిలిటీ, ప్రసిద్ధ సూపర్‌నోవా ఎస్ ఎన్ 1987 ఏ యొక్క గతి శీలత మొదలైనవి ఉన్నాయి.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆూ)కి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఎఎం) ఆధ్వర్యంలోని అబ్జర్వేటరీలోని టెలిస్కోప్, ఇంజనీర్లు మరియు ఖగోళ శాస్త్రవేత్తలు గత 50 సంవత్సరాలుగా నిర్మించిన సాంకేతిక సాధనాల కారణంగా సంబంధిత రంగం లో అన్వేషణ కొనసాగుతోంది. ఈ టెలిస్కోప్ విదేశీ సహచరుల మధ్య పోటీ లో నిలుస్తోంది. 1976లో క్యాస్‌గ్రెయిన్ ఫోటోమీటర్ మరియు ఎచెల్ స్పెక్ట్రోగ్రాఫ్ నుండి ప్రారంభించి, 1978లో కొత్త గ్రేటింగ్ స్పెక్ట్రోగ్రాఫ్, 1988లో ఫాస్ట్-ఛాపింగ్ పోలారిమీటర్ 2016లో దాని ప్రత్యామ్నాయం తో మరియు 2021లో సరికొత్త ఎన్ ఐ ఆర్ ఫోటోమీటర్, అబ్జర్వేటరీ తన సౌకర్యాలను నిరంతరం అప్‌గ్రేడ్ చేస్తూనే ఉంది.

"ఈ టెలిస్కోప్ ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల నుండి ఆధునిక సి సి డి ల వరకు ఖగోళ పరిశీలనలలో సాంకేతిక మార్పులకు సాక్షిగా నిలుస్తుంది" అని ఐ ఐ ఎ డైరెక్టర్ ప్రొఫెసర్ అన్నపూర్ణి సుబ్రమణ్యం అన్నారు. "ఈ సదుపాయం తో ఖగోళ అన్వేషణ ఉత్పాదకత కొనసాగుతుందని మరియు రాబోయే సంవత్సరాల్లో శాస్త్రవేత్తలచే ఉపయోగించబడుతుందని నేను విశ్వసిస్తున్నాను" అని ఆమె అన్నారు.

1960ల నాటికి, ఆధునిక ఖగోళ శాస్త్రంలో పరిశోధనలు చేయడానికి భారతదేశానికి అధిక-నాణ్యత గల ఆప్టికల్ అబ్జర్వేటరీ అవసరమని స్పష్టమైంది మరియు విస్తృతమైన అన్వేషణ తర్వాత, ప్రొఫెసర్ వైను బప్పు అటువంటి అబ్జర్వేటరీ కోసం కావలూర్‌ను ఎంచుకున్నారు. కవలూర్ పైన ఉన్న ఆకాశం అద్భుతమైనది మరియు దాని దక్షిణ ప్రదేశం ఉత్తర మరియు దక్షిణ ఆకాశాలను చాలా వరకు చూడటానికి అనుమతిస్తుంది. అబ్జర్వేటరీ కార్యకలాపాలు ప్రారంభించిన కొన్ని సంవత్సరాల తర్వాత, ప్రొఫెసర్ బప్పు జెనా (అప్పటి తూర్పు జర్మనీ)కి చెందిన కార్ల్ జీస్‌తో 40-అంగుళాల టెలిస్కోప్ కోసం ఆర్డర్ ఇచ్చాడు, అది తదనంతరం 1972లో స్థాపించబడింది.

40 అంగుళాల (లేదా 102 సెం.మీ.) వ్యాసం కలిగిన టెలిస్కోప్ 1972లో వ్యవస్థాపించబడింది మరియు వెంటనే ముఖ్యమైన ఖగోళ ఆవిష్కరణలను ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. ఒక తరం కంటే ఎక్కువ ఖగోళ శాస్త్రవేత్తలు ఈ టెలిస్కోప్‌లో శిక్షణ పొందారు. ఐ ఐ ఎ ఇంజనీర్లు పొందిన నైపుణ్యం తో 1980లలో పూర్తిగా స్వదేశీ 90-అంగుళాల (2.34 మీటర్లు) టెలిస్కోప్‌ను నిర్మించడానికి వీలు కల్పించింది. ఈ అసాధారణ టెలిస్కోప్ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని, ఐ ఐ ఎ తన బెంగళూరు క్యాంపస్‌లో డిసెంబర్ 15న సమావేశాన్ని నిర్వహించింది, ఆ తర్వాత 16న కావలూరులో ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. అనేక మంది రిటైర్డ్ ఐ ఐ ఎ ఖగోళ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు మరియు టెలిస్కోప్ సహాయకులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు డైరెక్టర్ ఐ ఐ ఎ పలువురిని సత్కరించారు. 40-అంగుళాల టెలిస్కోప్ అందించిన ముఖ్యమైన సైన్స్ ఆవిష్కరణల గురించి అనేక చర్చలు అలాగే ఆ సమయం నుండి పనిచేసిన సిబ్బంది వ్యక్తిగత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఐ ఐ ఎ విద్యార్థులు ప్రచురించిన ఖగోళ శాస్త్ర పత్రిక "దూత్" 7వ సంచిక కూడా ఈ కార్యక్రమంలో విడుదల చేయబడింది.

కావలూరు పరిసర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు 40 అంగుళాల టెలిస్కోప్ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు 16వ తేదీన అబ్జర్వేటరీలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు.

## ఘనంగా ముదిరాజ్ సంఘం ప్రారంభ పూజ

కామారెడ్డి జిల్లా 22, డిసెంబర్ 2022(నేటి నిజం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా గురువారం సదరు ముదిరాజ్ సంఘం ప్రారంభ పూజ జరపడం జరిగింది. గణపతి పూజ, గౌరమ్మ పూజ, లగ్నం పూజ, నవగ్రహ పూజ, హోమం పూజ, సత్యనారాయణ పూజ, ముదిరాజ్ సదర సంఘం పూజ మహోత్సవం ఘనంగా జరుపబడింది. ఇట్టి పూజకు ముదిరాజ్ అన్ని పాండిల సంఘాల నుంచి హాజీరయ్యారు. పూజ అనంతరం భోజనాలు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సదర్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షులు గంగరాజు, సెక్రెటరీ నీలకంఠం మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై, కానిస్టేబుల్ నియామకాల్లో దేహదారుఢ్య పరీక్ష విదానాన్ని మార్చాలి

హైదరాబాద్ డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పోలీసు ఎస్సై, కానిస్టేబుల్ నియామకల్లో భాగంగా దేహదారుఢ్య పరీక్ష విదానాన్ని మార్చాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదానకార్యదర్శి పగడాల సుదాకర్ ముదిరాజ్ డిమాండ్ చేసారు. పరీక్ష విదానాన్ని ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. బుదవారంబిసి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ దేశం లో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో లాంగ్ జంప్ 3.8 మీటర్ల నుండి 4 మీటర్ల పెంచారని, షాట్ పుట్ 5.6 మీటర్ల నుంచి 6 మీటర్ల కు పెంచారని అన్నారు. దీనివల్ల ఎక్కువ మంది అభ్యర్థులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసలే నిరుద్యోగం తో బాధపడుతున్న యువత డిగ్రీ,బి.టెక్ లాంటి పెద్ద పెద్ద చదువులు చదివి చివరకు కానిస్టేబుల్ ఉద్యోగాలకు అప్లై చేసుకోవలసిన దుస్థితి రాష్ట్రం లో నెల కొందన్నారు. లాంగ్ జంప్, రన్నింగ్ లలో సహితం ఉరకలేక దమ్ముతో 20 మంది వరకు మృత్యు వాతపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇటీవల పోలీసు ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలు మొదయాన నాటినుండి డిజిటల్ ద్వారా ఎత్తుకొలిచే సమయంలో కూడా సాంకేతిక విభవం వల్ల చాలామంది అభ్యర్థులు నష్టపోతున్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మ్యానువల్ గా ఎత్తుకొలతలు తీసుకోవాలని లాంగ్ జంకు దూరాన్ని తగ్గించి పాద విధానాన్ని అమలు చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సింగిల్ డిజిట్ వస్తే అది కూడా గొప్పే

### – డీఎల్ రవీంద్రారెడ్డి ఒక సంచలన సర్వే

అమరావతి డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వచ్చే ఎన్నికల్లో ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది అన్నది పెద్ద చర్చ. దాని మీద సర్వేలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఇక ఎవరి మటుకు వారు తమ పార్టీయే గెలుస్తుంది అని అంటూంటారు. అయితే ప్రస్తుతానికి వైసీపీలోనే ఉన్న సీనియర్ మోస్ట్ లీడర్ మాజీ మంత్రి వైఎస్సార్ సమకాలీనుడు అయిన డాక్టర్ డీఎల్ రవీంద్రారెడ్డి ఒక సంచలన సర్వే వినిపించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సింగిల్ డిజిట్ వస్తే అది కూడా గొప్పే అన్నారు. అంటే వైనాట్ 175 అంటూ వైసీపీ దూకుడు చేస్తూంటే కేవలం పది లోపు సీట్లు మాత్రమే వైసీపీకి వస్తాయని డీఎల్ చెప్పడం విశేషమే అనుకోవాలి. డీఎల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ జగన్ని అతి పెద్ద అవినీతిపరుడిగా కూడా విమర్శించారు. జగన్ వైఎస్సార్ కుమారుడిగా తాము వేరేగా చూశామని అయితే ఆయన అంత అవినీతిపరుడు మరొకరు లేరు అని డీఎల్ విమర్శలు గుప్పించారు. ఇక ఏపీని వైసీపీ సర్వనాశనం చేసింది అని ఆయన దుయ్యబెట్టారు. ఈ పరిస్థితుల్లో ఏపీని కాపాడాలీ అంటే అది ఒక్క చంద్రబాబు వల్లనే సాధ్యమని కూడా డీఎల్ చెప్పారు. మరో వైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిజాయతీని ప్రశ్నించలేమని అన్నారు. అయితే జనసేన టీడీపీ రెండు పార్టీలు కలసి పోటీ చేస్తాయని అనుకుంటున్నట్లుగా డీఎల్ అంటున్నారు. ఆ పార్టీలు కలసి పోటీ చేస్తే ఏపీలో వైసీపీకి ఒంటరి సంఖ్యలోనే సీట్లు వస్తాయని అది కూడా గొప్పే అని ఆయన అన్నారు. ఇక వైఎస్ వివేకా కేసు విచారణ జనవరి 3 నుంచి జరగనుందని దాంతో కొత్త మలుపు ఈ కేసు తిరుగుతుందని డీఎల్ అంటున్నారు. ఈ కేసులో ఎర్ర గంగిరెడ్డి కీలకమైన వ్యక్తి అని సీబీఐ గుర్తించిందని ఆయన అన్నారు. ఇక జనవరి 3న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ పిటిషన్ మీద వాదనలు ఉన్నాయని ఆ రోజున సుప్రీం తీర్పు తరువాత కడప జిల్లాలో చాలా మార్పులు చోటు చేసుకుంటాయని డీఎల్ అంటున్నారు. మాజీ మంత్రి వివేకా కేసుతో చాలా మంది మెడకు ఉచ్చు బిగుసుకునే అవకాశం ఉంది అని ఆయన పేర్కొనడం విశేషం. ఇదిలా ఉండగా వివేకా హత్య కేసు విషయంలో ఒంటరిగా ఆయన కుమార్తె సునీత పోరాడడం మెచ్చుకోవాల్సిందే అని ఆయన అన్నారు. ఇక తన గురించి చెబుతూ ఈ రోజుకి తాను వైసీపీలోనే ఉన్నానని తనను ఎవరూ తీసేయ లేదని అన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో తాను ఏదో ఒక ప్రముఖ పార్టీ నుంచే పోటీకి దిగుతాను అని డీఎల్ చెబుతున్నారు. మొత్తానికి డీఎల్ వైసిపి మీద జగన్ మీద కడప జిల్లా రాజకీయాల మీద సంచలన కామెంట్స్ చేశారు. దీనికి వైసీపీ నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

## 6జీ సాంకేతికత

న్యూఢిల్లీ, డిసెంబర్ 22:2021 నవంబర్ 1వ తేదీన, వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలు, పరిశోధన ఒ అభివృద్ధి సంస్థలు, విద్యాసంస్థలు, ప్రామాణికత సంస్థలు, టెలికాం సేవల కంపెనీలు, పరిశ్రమకు చెందిన సభ్యులతో 6జీ మీద ఒక టెక్నాలజీ ఇన్నోవేషన్ గ్రూప్‌ను (టీఐజీ-6జీ) కేంద్ర టెలికమ్యూనికేషన్స్ విభాగం ఏర్పాటు చేసింది. భారతదేశంలో 6జీ దృక్పథం, లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం ఈ బృందం బాధ్యత. టెలికాం పరిశ్రమ, విద్యాసంస్థలు, ఆర్‌డడి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ సభ్యులతో ఆరు కార్యనిర్వాహక బృందాలను టీఐజీ-6జీ ఏర్పాటు చేసింది. బహుళాంశ సృజనాత్మక పరిష్కారాలు, బహుళాంశ తర్వాతి తరం నెట్‌వర్క్‌లు, తర్వాతి తరం అవసరాలకు తగ్గ స్పెక్ట్రం, పరికరాలు, అంతర్జాతీయ ప్రమాణాలు, పరిశోధన ఒ అభివృద్ధి సంస్థలకు నిధులు అంశాల మీద ఈ ఆరు కార్యనిర్వాహక బృందాలు ఏర్పాటయ్యాయి. 6జీని ఆచరణలోకి తీసుకొచ్చే కార్యక్రమాల్లో అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్స్ యూనియన్‌కు (ఐటీయూ) కూడా భారతదేశం సహకారం అందిస్తోంది.

లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా, కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి శ్రీ దేవుసిన్హ్ చౌహాన్ ఇవాళ లోక్‌సభకు ఈ సమాచారాన్ని అందించారు.

## దీర్ఘకాలిక రోగులూ తస్మాత్ జాగ్రత్త.. వైద్యుల హెచ్చరిక

జైపూర్ డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశంలో కొవిడ్ నాలుగో వేవ్ ముంచుకొస్తున్నదని వార్తలు వెలువడుతున్నాయి. ఇప్పటికే చైనాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఒమిక్రాన్ బీఎఫ్-7 వేరియంట్.. భారత్‌లోనూ కాలు మోపిందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుజరాత్‌లో ఇద్దరిలో, ఒడిశాలో ఒకరిలో ఒమిక్రాన్ బీఎఫ్-7 రకం కరోనా వైరస్‌ను గుర్తించారు. ఇవాళ ఉదయం కూడా మరో కేసులో ఒమిక్రాన్ బీఎఫ్-7 రకం బయటపడినట్లు తెలుస్తున్నది.శరవేగంగా విస్తరించే ఈ కొత్త వేరియంట్‌తో దేశంలో నాలుగో వేవ్ విజృంభిస్తుందేమోనని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ వైద్యుడు రాజీవ్ బన్సల్.. ఇప్పటికే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు రాబోయే రోజుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా బ్లడ్ షుగర్ స్థాయిలు, బ్లడ్ ప్రెషర్ చెక్ చేసుకోవాలని చెబుతున్నారు.కరోనా మరో వేవ్ వస్తే ఇప్పటికే షుగర్, బీపీ, థైరాయిడ్‌తోపాటు గుండె, కాలేయం, కిడ్నీలు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారికి చాలా ప్రమాదకరమని చెప్పారు. కరోనా సోకక ముందే తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వారు ప్రమాదం నుంచి బయటపడవచ్చని చెప్పారు. మాస్కులు ధరించడం, శానిటైజర్ వినియోగించడం, తినడానికి ముందు హ్యాండ్ వాష్ లేదా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడం, సామాజిక దూరం పాటించడం ద్వారా కరోనా మహమ్మారిని దూరం పెట్టొచ్చని రాజీవ్ బన్సల్ తెలిపారు.

## టెలికాం, నెట్‌వర్కింగ్ ఉత్పత్తుల్లో పీఎల్ఐ పథకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 22:టెలికాం, నెట్‌వర్కింగ్ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి 01.04.2021 నుంచి అమల్లోకి వచ్చేలా, 24.02.2021న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని టెలికమ్యూనికేషన్స్ విభాగం ప్రకటించింది. ఈ పథకం కింద 04.06.2021 నుంచి 03.07.2021 వరకు దరఖాస్తులను ఆహ్వానించారు. అర్హత గల 31 దరఖాస్తులను 14 అక్టోబర్ 2021న ఆమోదించారు. డిజైన్ కేంద్రీకృత తయారీని చేర్చడానికి, 01.04.2022 నుంచి అమలులోకి వచ్చేలా ఈ పథకం మార్గదర్శకాలను 20.06.2022న సవరించారు. 21.06.2022 నుంచి 25.08.2022 వరకు దరఖాస్తులను ఆహ్వానించారు. ప్రస్తుతం ఉన్న 14 సంస్థలు ఇప్పటికే అందుకుంటున్న ప్రోత్సాహకాలతో కొనసాగాయి. 32 దరఖాస్తులు, 28 అర్హత గల దరఖాస్తులకు 31 అక్టోబర్ 2022న ఆమోదం లభించింది. అర్హత ఆధారంగా, ప్రస్తుతం, పీఎల్ఐ పథకం కింద ఆమోదించిన 42 సంస్థలు ఉన్నాయి. ఈ 42 సంస్థల్లో 17 సంస్థలు డిజైన్ కేంద్రీకృత ఉత్పత్తులు చేస్తున్నాయి.

ఈ 42 కంపెనీలు రూ.4,115 కోట్ల పెట్టుబడులకు అంగీకరించాయి. దీనివల్ల పథకం అమలు సమయంలో రూ.2.45 లక్షల కోట్ల అదనపు విక్రయాలు, 44,000 మందికి పైగా ఉద్యోగ సృష్టి సాధ్యమవుతుంది. టెలికాం, నెట్‌వర్కింగ్ ఉత్పత్తుల విషయంలో భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడానికి పరిశ్రమ నుండి వచ్చిన ప్రతిస్పందనను ఈ దరఖాస్తుల సంఖ్య సూచిస్తుంది.

టెలికాం, నెట్‌వర్కింగ్ ఉత్పత్తుల కోసం, 01.04.2021 నుంచే అమలులోకి వచ్చేలా పీఎల్ఐ పథకాన్ని 24.02.2021న ప్రకటించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.420 కోట్ల అదనపు పెట్టుబడి, రూ.9,019 కోట్ల విక్రయాలు, 4,938 మందికి ఉపాధి లభించింది. రాష్ట్రాలు ఉ యూటీల వారీగా కంపెనీల జాబితా అనుబంధంలో ఉంది.

## తగినన్ని సంకేతాలు, రోడ్డు పక్క/ మధ్యస్థ సుందరీకరణతో జాతీయ రహదారుల అభివృద్ధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 22:జాతీయ రహదారులు (ఎన్‌హెచ్‌లు) అభివృద్ధి, నిర్వహణకు మంత్రిత్వ శాఖ ప్రాథమికంగా బాధ్యత వహిస్తుంది.

జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన వివిధ పథకాల కింద పర్యాటక ప్రదేశాలకు రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు రోడ్డు పక్క సౌకర్యాలు, తగినంత గుర్తులు, సంకేతాలు, రహదారు పక్క/ మధ్యస్థ సుందరీకరణ, తదితరాలతో జాతీయ రహదారుల అభివృద్ధిని మంత్రిత్వ శాఖ నిరంతరంగా చేపడుతోంది.

ఇందుకు అదనంగా, భారత మాల పరియోజనలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంతో సహా వివిధ రాష్ట్రాల్లో సుమారు 28 నగరాల్లో రింగ్ రోడ్ల అభివృద్ధితో సుమారు 125 చోకింగ్ (ఘాతం) కలిగించే పాయింట్లలో, 66 రద్దీ పాయింట్లలో రద్దీని తగ్గించినట్లు గుర్తించారు. మొత్తం 191 చోక్/ రద్దీ పాయింట్లలో 56 చోక్/ రద్దీ పాయింట్లు సరిదిద్దడం జరుగగా, 82 చోక్/ రద్దీ పాయింట్లలో పనులను చేపట్టడం/ అందించడం జరిగింది.

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు 4 రింగ్ రోడ్లను గుర్తించగా, 3 రింగ్ రోడ్లకు సంబంధించి పనులను ఇవ్వడం/ ప్రారంభించడం జరిగింది. అంతేకాకుండా, 9 చోక్/ రద్దీ పాయింట్లను అభివృద్ధి కోసం గుర్తించగా, అందులో 8ని సరిదిద్దడం జరిగింది.

ఈ సమాచారాన్ని కేంద్ర రోడ్డు రవాణా ఉ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభకు బుధవారంనాడు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వెల్లడించారు.

## కర్నూల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వార్షిక తనిఖీ..



అమరావతి: డిసెంబర్ 22: వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్.సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ కలిసి గురువారం ఉదయం తనిఖీ చేశారు. ముందుగా పోలీసు గార్డు సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా డీపీవోలోని అన్ని విభాగాల పనితీరు గురించి డీజీపీ సమీక్షించారు. ఆఖా, ఆర్మ్ డు రిజర్వుడు, డీసీఆర్బీ రికార్డుల నిర్వహణ గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వార్షిక పనితీరు, నివేదికల గురించి అడిగి తెలుసుకున్నారు. సంతృప్తిని వ్యక్తం చేశారు. డీసీఆర్బీ విభాగంలో మహిళల పై జరిగే నేరాలు, ఎస్సీ ఎస్టీ నేరాలు, ఇతర ముఖ్యమైన రికార్డుల డేటాను పరిశీలించారు. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్ డేట్ ఉండే విధంగా చూడాలన్నారు. ఎఆర్ విభాగంలో డిపాజిట్ చేసిన ఆయుధాల డేటా, మోటార్ ట్రాన్స్ పోర్టు(ఎంటీ), స్పెషల్ పార్టీ ఉ ఖూలాలు, మాబులేషన్, ఃఆ టీం, మినరల్ వాటర్, జిమ్, పోలీసు క్వాటర్స్, పరేడ్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. వార్షిక తనిఖీలో ఎఆర్ డిఎస్పీ ఇలియాజ్ భాషా, డిపిఓ ఎఓ సురేష్ బాబు, డిసిఆర్ బి సిఐ గుణశేఖర్ బాబు ఉన్నారు.

# పోలవరం...రైల్వే జోన్...రెండూ అడగొద్దు

న్యూ డిల్లీ డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీకి పోలవరం ఒక వరం. అభివృద్ధికి సంకేతం. అలాంటి పోలవరం ప్రాజెక్ట్ ఎపుడు పూర్తి అవుతుందో ఎవరూ చెప్పలేని స్థితి. తాజాగా పార్లమెంట్ లో కేంద్రం చేసిన ప్రకటనను బట్టి చూస్తే 2024 లో అయినా పూర్తి అవుతుందా అన్న సందేహాలు కలుగుతున్నాయి. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అయినా ఇరిగేషన్ కంపోనెంట్ కి మాత్రమే కేంద్రం నిధులు ఇవ్వాలని చూస్తోంది.మరి పునరావాస ప్యాకేజి అతి పెద్ద మొత్తంలో ఉంది. దాదాపుగా ముప్పయి వేల కోట్ల పైబడి ఆ ఒక్క దానికే చెల్లించాలి. మరి ఆ మొత్తం భరాయించేందుకు కేంద్రం సిద్ధంగా లేదని పలు సందర్భాలలో తెలుస్తూనే ఉంది. సో పోలవరం ప్రాజెక్ట్ అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు.ఇపుడు ఆ జాబితాలో మరోటి వచ్చి చేరింది. ఇది కూడా విభజన హామీల్లో ఉన్నదే. విశాఖకు రైల్వే జోన్ అన్నది ఉత్తరాంధ్రా వాసుల కల. అది యాభై ఏళ్ళ కల. అలాంటి విశాఖ రైల్వే జోన్ ఇస్తున్నామంటూ ఇప్పటికి నాలుగేళ్ళ క్రితం విశాఖకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. మరి ఈ రోజుకు విశాఖ రైల్వే జోన్ ఎక్కడ ఉంది అంటే అక్కడే ఉంది.లేటెస్ట్ గా చూస్తే విశాఖ రైల్వే జోన్ అన్నది అలా కొనసాగిస్తామని అది సాగుతూనే ఉంటుందని దానికి డెడ్ లైన్ అంటూ వేరేగా ఏదీ పెట్టుకోలేదని అది నిరంతర ప్రక్రియ అని రైల్వే బోడు అధికారులు అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. రైల్వే జోన్ కి 2020-21లో రూ.170 కోట్లు కేటాయించినట్టు రైల్వే బోర్డు తెలిపింది.ఈ మొత్తంలో 106 కోట్ల రూపాయలు కేటాయించి రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించినట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే వర్తమాన ఆర్థిక సంవత్సరం అంటే 2022-23లో రైల్వే జోన్ హెడ్ క్వార్టర్స్ కోసం ఆరు లక్షలు ఖర్చు చేశామని వివరిస్తున్నారు. ఇక దీన్ని బట్టి చూస్తే రైల్వే జోన్ ఎప్పటికి పూర్తి అవుతుందో ఊహించుకోవచ్చు అని అంటున్నారు. విశాఖలో రైల్వే జోన్ పేరు చెప్పి లాభాల బాటలో ఉన్న వాల్తేర్ డివిజన్ ని లేకుండా చేశారు.కొత్తగా రాయగడ డివిజన్ ని ఏర్పాటు చేసి ఒడిషా వారికి మేలు కలిగేలా చూశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా విశాఖ రైల్వే జోన్ మాత్రం చాలా నెమ్మదిగా సాగుతూ ఉంది. విశాఖ రైల్వే జోన్ ఎపుడు నిర్మాణం అవుతుంది. దాని కార్యకలాపాలు ఎపుడు మొదలవుతాయి అన్నది మాత్రం ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకోలేదని అంటున్నారు. అంటే అయినపుడు అవుతుంది అన్న మాట. అంతవరకూ ఏం చేయాలి అంటే ఎదురు చూడాలి.ఇక్కడ ఒక తమాషా ఉంది. అదేంటి అంటే విశాఖ రైల్వే జోన్ లేదా అంటే అనడానికి ఉంది. ఇచ్చారు. కానీ అది అందుబాటులోకి వస్తుందా అంటే మాత్రం అడగకూడదు అని అంటున్నారు. ఈ విధంగా అయితే ఇప్పటికి ఎన్నో ఎన్నికలకు చూసిన విశాఖ రైల్వే జోన్ సులువుగా మరో రెండో మూడో ఎన్నికలు చూసినా ఆశ్చర్యం లేదు అని అంటున్నారు. సో రైల్వే జోన్ ఎపుడు పూర్తి అవుతుంది అంటే జవాబు మాత్రం ఎవరికీ తెలియదంతే.

# దండయాత్రలా మామీదకు రాకండి

- బాబు పాలనలోనే ఖమ్మం జిల్లాకు తీవ్ర అన్యాయం: మంత్రి పువ్వాడ అజయ్
- మీ అభివృద్ధిని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా: బాబుకు మంత్రి పువ్వాడ సవాల్
- టీడీపీ సభలో సగం మంది ఆంధ్రోళ్లే
- కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే ఖమ్మంకు వైభవం
- ఎన్టీఆర్ ఓ విలక్షణ నేత: పువ్వాడ
- మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్




ఖమ్మం, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): టీడీపీ హయాంలోనే ఖమ్మం అభివృద్ధి జరిగిందని చంద్రబాబు చెప్పారని, తెలంగాణలో ఏడు మండలాలు తీసుకుని, సీలేరు ప్రాజెక్టును గుంజుకున్నది చంద్రబాబేనని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. గురువారం హైదరాబాద్ లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు.

చంద్రబాబు హయాంలో ఖమ్మంకు ఒక్క ప్రాజెక్ట్ వచ్చినట్టు నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తాను అని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఇప్పుడు తామంతా చాలా సుఖంగా ఉన్నామని, ఇప్పుడు మళ్లీ చంద్రబాబు రాష్ట్రానికి దండయాత్రలాగా వచ్చాడన్నారు. భద్రాచలంకు పూర్తి కరకట్ట చంద్రబాబు కట్టి ఉంటే మొన్న వానకు నీళ్ళు వచ్చేవా అని మంత్రి పువ్వాడ ప్రశ్నించారు. చంద్రబాబు ఖమ్మం సభలో కుటీల బుద్ధిని కపట నీతిని ప్రదర్శించారని ఏ మొహం పెట్టుకొని ఖమ్మంలో సభ పెట్టావ్ బాబు అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల బతుకులు ఆగం చేసిన బాబు పచ్చబడ్డ తెలంగాణలో చిచ్చుపెట్టేందుకు మళ్ళీ బయలుదేరాడు అన్నారు. తెలంగాణ ఏర్పడిన తొలి రోజు నుంచి చంద్రబాబు కుట్ర బుద్ధులు బయటపడ్డాయన్నారు. ఎన్టీఆర్ ఓ విలక్షణమైన నేత అని, ఆయన సంస్కరణల గురించి సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీలో చెప్పారన్నారు. కానీ, ఎన్టీఆర్ గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదన్నారు. పోలవరానికి ఏడు తెలంగాణ మండలాలను చంద్రబాబు మోడీ మోహర్బానీతో గుంజుకుని ఖమ్మంలో గురువింద గింజల మాట్లాడుతున్నాడని వ్యవసాయం దండగ అని అన్నోడే తెలంగాణలో ఆ ప్రాజెక్టు కట్టాం ఈ ప్రాజెక్టు కట్టామంటూ కట్టు కథలు చెబుతున్నాడని రైతులను నిర్లక్ష్యం చేసి మేము ఓడిపోయామని 2004 ఓటమి తర్వాత చేసిన ప్రకటన చంద్రబాబు ఒకసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఉచిత విద్యుత్ ఇస్తే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలని రైతుల అవమానపరిచిన వ్యక్తి నేడు మొసలి కన్నీరు ప్రదర్శిస్తున్నాడని బషీర్బాగ్ లో కరెంట్ చార్జీలు తగ్గించాలన్న రైతులపై కాల్పులు జరిపించి ముగ్గుని బలిగొన్నది నువ్వు కాదా బాబు అని మంత్రి ప్రశ్నించారు. నీ అవకాశవాద రాజకీయాలు ఏపీలో ప్రదర్శించుకో తెలంగాణలో కాదు అన్నారు. 2018లో మహాకూటమి పేరుతో తెలంగాణలో వసం చేసుకోవాలి కుట్ర పన్నితే ప్రజలు ఏకమై చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# ఒక్క దెబ్బకు రెండు పిట్టలు..చంద్రబాబు రూటే సపరేటు..




హైదరాబాద్ డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఒకే ఒక్క మీటింగ్. దెబ్బకు అంతా చేంజి అయ్యేలా చేస్తోంది. బీజేపీ పెద్దల దయ కోసం వారి చల్లని చూపు కోసం తెలుగుదేశం మూడున్నరేళ్ళుగా పడరాని పాట్లు పడుతోంది. ఉహూ కుదరలేదు. దాంతో అపర చాణక్యుడు అయిన చంద్రబాబు ఏపీ నుంచి లాభం లేదు అనుకుంటూ తెలంగాణ గేట్ తెరచారు.తెలుగుదేశం పార్టీకి స్ట్రాంగ్ గా పునాదులు తెలంగాణాలో ఉన్నాయి. ఉమ్మడి ఏపీలో ఎపుడూ ఎక్కువ ఓట్లూ సీట్లూ తెలంగాణా నుంచే ఆ పార్టీకి వచ్చినట్లు చరిత్ర రికార్డులో పదిలంగా ఉంది. అందుకే బాబు దాదాపు ఎనిమిదేళ్ల తరువాత తెలంగాణాలో సైకిల్ స్పీడ్ పెంచేశారు. ఈ మధ్య కాలంలో ఆయన తెలంగాణ మీద ఫోకస్ పెట్టారు. దానికి అనేక కారణాలు ఉన్నాయి.టీయారెస్ దెబ్బకు కొంతవరకూ పసుపు ప్రభలకు మసక బారినా కూడా తమ అసలు బలం అలాగే ఉంది అని చెప్పేందుకే బాబు తెలంగాణా నుంచి నరుక్కు వస్తున్నారు. ఎటూ టీయారెస్ బీయారెస్ అయి బాబుకు పక్కాగా తెలంగాణా రూట్ క్లియర్ చేసిన వేళ చంద్రబాబు ఖమ్మం మీటింగ్ పెట్టారు. ఆ మీటింగ్ అదిరిపోయే లెవెల్ లో సాగింది. ఏకంగా వేయి కార్లతో బాబు ఖమ్మం వెళ్లారు. అక్కడ తండోపతండాలుగా జనాలు వచ్చి మరీ తెలుగుదేశం వెంటపడ్డారు.బాబు స్పీచ్ కి జనం నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ మీటింగ్ చూసిన వారు అంతా తెలుగుదేశం పార్టీకి ఇంతటి ఆదరణ ఉందా. ఎనిమిదేళ్ళుగా పెద్దగా పొలిటికల్ యాక్టివిటీ లేకపోయినా ఈ జోరు ఏంటి అని ముక్కున వేలేసుకున్నారు ఇక ఈ న్యూస్ అంతా అటూ ఇటూ తిరిగి నేరుగా ఢిల్లీ బీజేపీ పెద్దలకు కూడా చేరింది అని అంటున్నారు. బీజేపీకి తెలంగాణా ఇపుడు కావాలి. దేశంలో ఎన్నో రాష్ట్రాలను గెలుచుకున్నా సౌత్ లో అందులో తెలుగు రాష్ట్రాలలో తమ బలాన్ని ఉనికికి చాటుకోలేక పోతున్నామన్న బాధ బెంగ బీజేపీకి ఉన్నాయి. ఇక రెండు సార్లు టీయారెస్ అధికారంలోకి వచ్చింది. ఇక బీయారెస్ గా మారి మూడవ విడత పోటీ చేయబోతోంది. మునుపటి హుషార్ జోష్ కారు పార్టీకి ఇపుడు లేవు అని అంటున్నారు. దాంతో అదే బీజేపీకి కొత్త ఆశలు కల్పిస్తోంది.ఇక మరో వైపు చూస్తే బీయారెస్ తరువాత క్షేత్ర స్థాయిలో గట్టిగా ఉండే కాంగ్రెస్ ఇపుడు వర్గ పోరుతో సతమతం అవుతోంది. ఢీ అంటే ఢీ కొట్టాల్సిన కాంగ్రెస్ తనకు తానుగా జారిపోతోంది. ఈ అద్భుత అవకాశంతో బీజేపీ తెలంగాణాలో బీజేపీకి అధికార పీఠం ఊరిస్తోంది. అయితే అది బీజేపీ సొంత బలంతో అయితే సాధ్యపడుతుందా అంటే కుదిరేది లేదని అంటున్నారు.ఎంతలా బీజేపీ స్పీడ్ పెంచినా సొంతంగా బలంతో ఇప్పటికిపుడు అధికారంలోకి వచ్చే సీన్ అయితే లేదు. దాంతో తెలుగుదేశం తెలంగాణాలో తన బలాన్ని నిరూపించుకుంటున్న క్రమంలో ఆ పార్టీ గురించి బీజేపీ ఢిల్లీ పెద్దలలో కొత్త ఆలోచనలు మొదలయ్యాయని అంటున్నారు. ఎందుకంటే బీజేపీకి తెలంగాణా ఊరిస్తోంది. తెలుగుదేశం అండగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఏపీలో కూడా పొత్తు పెట్టుకుంటేనే తెలంగాణాలో సాధ్యపడుతుంది.మరి ఈ విషయంలో కేంద్ర బీజేపీ పెద్దలు ఏమి నిర్ణయం తీసుకుంటారు అన్నది మాత్రం చర్చగా ఉంది. తెలంగాణా బీజేపీలో జగన్ అనుకూలురు కొందరు చేరి బీజేపీ టీడీపీల మధ్య పొత్తు కుదరకుండా చేస్తున్నారని టాక్. మొత్తానికి ఖమ్మం సభ కాస్తా బీజేపీ గుమ్మం దాకా టీడీపీ సత్తా ఏంటో వెళ్లేలా చేసింది అంటున్నారు. తెలుగుదేశం తెలంగాణాలో మరిన్ని మీటింగ్స్ కి రెడీ అవుతోంది. దంతో చాలా తొందరలోనే బీజేపీ టీడీపీతో పొత్తుకు సై అనే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇక తెలంగాణాలో తొందరలో ఎన్నికలు వస్తాయని అంతా భావిస్తున్న టైంలో ఈ పొత్తులు కుదిరితే కనుక రెండు తెలుగు రాష్ట్రాలలో గణనీయమైన మార్పు రావడం తథ్యమని అంటున్నారు.



ములుగు జిల్లా కేంద్రంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు ములుగు సెయింట్ పీటర్ పాల్ చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మొదలయ్యాయి ఫాదర్ మహిపాల్ రెడ్డి క్యారల్ సింగింగ్ ప్రతి ఇంటిలో ప్రార్ధనలు మిని క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అం టాయి ఇందులో పాల్గొన్న, సిస్టర్ రెజ్జి సుపీరియర్ సిస్టర్ జ్యోతి సిస్టర్ గ్రేసి,క్రైస్తవులు సంఘ సభ్యులుమరియుఇతర స్నేహితులుసంబరాలలో పాల్గొన్నారు

## మాజీ ఎంపీ జయప్రదకు రాంపూర్ ప్రత్యేక కోర్టు నాన్ బెయిల్బుల్ వారెంట్

లక్నో డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్) ;ప్రముఖ నటి మాజీ ఎంపీ జయప్రదకు ఉత్తరప్రదేశ్ లోని రాంపూర్ ప్రత్యేక కోర్టు షాకిచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘన లకు సంబంధించి ఆమెపై నమోదైన కేసుల విషయంలో విచారణకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిల్బుల్ వారెంట్ జారీ చేసింది. వచ్చే విచారణకు జయప్రద స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కేసులకు సంబంధించి జయప్రదపై వేర్వేరుగా రెండు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమెకు వారెంట్ ఇచ్చినట్లు ప్రభుత్వ న్యాయవాది అమర్నాథ్ తివారీ తెలిపారు.ఈ కేసుల విచారణ సమయంలో జయప్రద వరుసగా కోర్టుకు హాజరుకాకపోవడం రాంపూర్ ప్రత్యేక కోర్టు ఆమె తీరుపై ఆగ్రం వ్యక్తం చేసింది. ఈ కారణంగానే జయప్రదపై తాజాగా రాంపూర్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. అంతేకాదు డిసెంబర్ 27 విచారణ సందర్భంగా జయప్రదని కోర్టులో హాజరుపరచాలని రాంపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసును కోర్టు ఆదేశించింది. ఇక ఈ కేసు తదుపరి విచారణను జనవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

## లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు.



ములుగు ,డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో గురువారం గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు టాలెంట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్యోతి తోట , ఉపాధ్యాయులు సిస్టర్ గ్రేస్, సిస్టర్ రెజీ చాకో, గణిత ఉపాధ్యాయులు లక్ష్మణ్, రమణాచారి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా.. దొంగతనాలు



వరంగల్, డిసెంబర్ 22:వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ పోలీస్ స్టేషన్ లో ఈస్ట్ జోన్ డీసీపీ వెంకటలక్ష్మి వివిధ దొంగతనాల కేసులలో పలువురు నిందితులను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకేపల్లి గ్రామానికి చెందిన జింక నాగరాజు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తూ జైలుకి కూడా వెళ్లి వచ్చినట్లు తెలిపారు. గేట్ కు తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చేసుకుని కొత్తకొత్త ప్రదేశాల్లో దొంగతనాలు చేసినట్లు తెలిపారు. నాగరాజు బుధవారం రాత్రి అయ్యప్ప దేవాలయం వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు తారస పడగా, తమదైన శైలిలో విచారించగా అతని వద్ద నుండి 33.7 తులాల బంగారాన్ని, 115 గ్రాముల వెండిని, ఒక స్కూటీను రికవరీ చేసినట్లు తెలిపారు. దొంగతనం చేసిన బంగారాన్ని మిత్రులైన నాగుల ప్రవీణ్, కట్ట రాజు, ఉల్లందుల ప్రశాంత్, వల్లంపట్ల పరమేష్ తో కలిసి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. నాగరాజుపై నర్సంపేటలో 7 కేసులు, గీసుకొండ పోలీస్ స్టేషన్ లో 1 కేసు ఉన్నట్లు తెలిపారు. నాగరాజుతో పాటు అతని స్నేహితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తలిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ మార్కెట్ లో పట్టుకున్న బంగారం విలువ 17.5 లక్షలు, వెండి 69 వేలు సుమారుగా ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన సీఐ పులి రమేష్ గౌడ్, ఎస్సైలు బొజ్జ రవీందర్, అంగోత్ సురేష్ లతో పాటు సిబ్బందిని డీసీపీ వెంకటలక్ష్మి,ఏసిపి సంపత్ రావు అభినందించారు.

## మినీ బస్సు బోల్తా.. 10మంది అయ్యప్ప భక్తులకు తీవ్రగాయాలు

అమరావతి: డిసెంబర్ 22:మినీ బస్సు బోల్తాపడడంతో 10మంది అయ్యప్ప భక్తులకు తీవ్రగాయాలైన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లాలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన అయ్యప్ప భక్తుల బృందం మినీ బస్సులో శబరిమలైకి వెళ్తుండగా నంద్యాల జిల్లా దీబగుంట వద్ద బోల్తా పడింది. దీంతో బస్సులో ఉన్న అయ్యప్ప భక్తుల్లో పది మందికి గాయాలు కావడంతో వారిని హుటాహుటినా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆహ్వానం

పాపినేని పుస్తకాల పరిచయ సభ



అధ్యక్షులు
మోదుగుల రవికృష్ణ
ప్రముఖ సాహిత్య పరిశోధకులు

ముఖ్యఅతిథి
డొక్కా మాణిక్యవరప్రసాద్
శాసనమండలి సభ్యులు

లోయలూ శిఖరాలూ పరిచయం
ఎమ్వీ రామిరెడ్డి
ప్రముఖ కవి, కథకుడు

వేదిక
RVRR B.Ed. కళాశాల
జేకేసి కళాశాల ఎదురు
గుంటూరు

సరళరేఖలు పరిచయం
ఉమ నూతక్కి
ప్రముఖ రచయిత్రి

సమయం
25.12.22 ఆదివారం
ఉ.10 గంటలకు

నిర్వహణ
సోమేపల్లి వెంకటసుబ్బయ్య
ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

# మహారాష్ట్రలో ఊరూరా బీఆర్ఎస్‌ను విస్తరిస్తాం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నాందేడ్, డిసెంబర్ 22: కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణలో అమలవుతున్న పథకాలన్ని దేశమంతటా అమలవుతాయని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ విస్తరణలో భాగంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ నియోజకవర్గం కిని గ్రామంలో గురువారం పర్యటించారు. రైతులు, వివిధ వర్గాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.

సీఎం కేసీఆర్ త్వరలోనే నాందేడ్ జిల్లాలో పర్యటించనున్నారని వెల్లడించారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు బీఆర్ఎస్ ను స్థాపించారని వివరించారు. మహారాష్ట్రలో ఊరూరా బీఆర్ఎస్ విస్తరిస్తామని, ప్రతీ జిల్లాలో తాలూకా, గ్రామస్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బీజేపీ, కాంగ్రెస్ పాలన చూసిన ప్రజలు బీఆర్ఎస్ తరహా పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని తెలిపారు. దేశంలో పుష్కలంగా సహజ వనరులు ఉన్నా అనుకున్న స్థాయిలో దేశంలో అభివృద్ధి జరగడం లేదని చెప్పారు. రైతులకు ఉచిత కరెంటు, రైతు బంధు ద్వారా సంవత్సరానికి రూ. 10వేల పెట్టుబడి, చనిపోయిన రైతుకు రైతుబీమా ద్వారా రూ. 5లక్షలు సీఎం కేసీఆర్ అందిస్తున్నారని వివరించారు.

హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి సాధిస్తున్నదని, ఐటీ, ఫార్మా ఇలా అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు. అందకుముందు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పాలజ్ కర్ర వినాయకున్ని దర్శించుకుని , ప్రత్యేక పూజలు చేశారు.నాందేడ్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు రమేశ్ రాథోడ్, సునీల్ కుమార్ బజాజ్, అశోక్ రాథోడ్ తదతరులు బీఆర్ఎస్ కు మద్దతు తెలిపారు.

# ఉపాధ్యాయులు బోధన సామర్థ్యం పెంపొందించుకోవాలి...



మహబూబాబాద్, డిసెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ఉపాధ్యాయులు తమ బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు.

గురువారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రగతి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన విద్యార్థుల సామర్థ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమ అమలు తీరును సంబంధిత మండల విద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థుల్లో విద్యపై పట్టు పెంచేందుకు ఉపాధ్యాయునిదే ప్రధాన పాత్ర అన్నారు. జిల్లాలో 798 పాఠశాలల్లో 27,857 మంది విద్యను అభ్యసిస్తున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా వీరి బోధనకు గాను 3,000 మంది ఉపాధ్యాయులు ఉన్నారు విద్యార్థుల హాజరు శాతము పాఠశాలల వారీగా తీసుకోవటం జరిగిందని ఉపాధ్యాయులు తమ బోధించే సబ్జెక్టులపై సమగ్ర అవగాహన పొంది ఉండాలన్నారు అదేవిధంగా బోధన పటిమ కూడా పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు విద్యపై పట్టు కోల్పోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తెలియజేశారు.

మండల స్థాయిలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రతి ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు.

ఇటీవల జరిపిన సర్వేలో లోపాలను గుర్తించడం జరిగిందని సరిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రతి ఉపాధ్యాయులు బయోమెట్రిక్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు బాధ్యతారహితంగా ప్రవర్తించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల వివరాలను పాఠశాల వారీగా హాజరు శాతాన్ని వెబ్సైటు నందు ఈ నెల 25 వ తారీకు లోగా నమోదు చేయాలని ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్స్ బుచ్చయ్య, శ్రీరాములు, సదయ్య, మండల

విద్యశాఖాధికారులు పూల్ చంద్, రాము, శ్రీదేవి, మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు జిల్లా ఎఫ్ఎల్ఎన్ రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

# గణిత శాస్త్రవేత్త శ్రీనివాసా రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి




ములుగు ,డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): భారతదేశ కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగరవేసిన గణిత శాస్త్రవేత్త శ్రీనివాసా రామానుజన్ ను ఆదర్శంగా తీసుకోవాలని ములుగు,భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు,

గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తస్లీమా హాజరయ్యారు, విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత ఎక్స్పురిమెంట్స్ (ఎగ్జిబిట్స్)ను పరిశీలించిన తస్లీమా విద్యార్థులను అభినందించారు,

అనంతరం తస్లీమా మాట్లాడుతూ ప్రతీ ఒక్క విద్యార్థి రామానుజన్ ను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత విద్యకు పునాది వేసుకొని దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలు కావాలని తస్లీమా అన్నారు,

టాలెంట్ టెస్టులలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు,

ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపాల్ రజినీకాంత్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

# నిజమైన అంబేద్కర్ వాది.. పి.వి.రావు

## -మాల మహనాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ



హైదరాబాద్ డిసెంబర్ 22 (ఎక్స్ప్రెస్ న్యూ స్);నిజమైన అంబేద్కర్ వాది.. పి.వి.రావు అని మాల మహనాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ కొనియాడారు. పి.వి.రావు 17 వ వర్ధంతి పురస్కరించుకొని మాల మహనాడు రాష్ట్ర కార్యాలయంలో పివి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంఘ నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా పబ్బతి శ్రీకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా దేవగుప్తం అనే చిన్న ఊరిలో అంబేద్కర్ భావజాలం ఉన్న దంపతులకు మొదటి సంతానంగా జన్మించిన పి.వి.రావు ఆది నుండే అంబేద్కర్ భావజాలంతో పని చేశారన్నారు. ఈ క్రమంలో ఆయన బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన ఆర్.పి.ఐ.పార్టీ అనుబంధ సంస్థ అయిన విద్యార్థి సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా సేవలందించిన నిజమైన అంబేద్కర్ వాది అని,తను చదువుతున్న సమయంలోనే దళిత బహుజనుల ఐక్యత కోసం వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి పి.వి.రావు అని కొనియాడారు. ఆయన పోరాటాల వెనుక ఆనాటి ఆర్.పి.ఐ.పార్టీ శాసనసభ్యులు బి.వి.రమణయ్య,స్ఫూర్తి ఉందని పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగాశ్రీకృష్ణ గుర్తు చేసుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు లో ఉన్నత విద్యను అభ్యసించి ఆనాటి ఎ.పి.పి.ఎస్సి ద్వారా గ్రూపు 1 ఉద్యోగం సాధించదమీ కాకుండా సామాజిక ఉద్యమ నేపథ్యం కలిగిన వ్యక్తులు కావడంతో ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించిన ఇంట్లోనే తన ఊపిరి ఉన్నంత వరకు అత్యంత సాధారణ జీవితం గడిపిన గొప్ప నేత పి.వి.రావు అన్నారు. 1997నాటికి ఆయన ప్రభుత్వ జీతం దాదాపు 30 వేల రూపాయలు. 1997 వరకు ఆంధ్ర ప్రదేశ్ అంబేద్కర్ సంఘంలో కీలకమైన పాత్ర పోషించిన పి.వి రావు అగ్రవర్ణాల పార్టీల కుట్రలో భాగమైన ఎస్సీ వర్గీకరణ సమస్య పైన శాస్త్రీయ అవగాహన కల్పించాల్సిన బాధ్యత తన పై ఉన్నదని భావించి ప్రభుత్వ కార్యాలయాన్నే మాల మహనాడు కార్యాలయంగా మార్చి అనేక రకాల కార్యక్రమాలు చేపట్టిన ధీరుడు పి.వి.రావు అనుఇ అన్నారు..ఆనాటి పాలక వర్గాలు ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఉధ్యమాలను ఎదుర్కోలేక ఆయనను ప్రభుత్వ ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసి ఇంటికి తాళాలు వేసి ఆయన కుటుంబాన్ని తీవ్రమైన మానసిక ఆర్థిక ఇబ్బందులకు గురిచేసింది. ఐనా వాటిని తట్టుకొని ఆయన ఎంచుకున్న మార్గం వదలకుండా ఏ రాజకీయ పార్టీలకు అమ్ముడు పోకుండా ముందుకు సాగారన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు ముఖ్యంగా మాజీ శాసన సభ్యులు దేవయ్య గారు,జి.వి హర్ష కుమార్ గారు, పనబాక కృష్ణయ్య, పనబాక లక్ష్మి గారు, జి వెంకట స్వామి లాంటి నేతలు,వివిధ పార్టీల నాయకులు పి.వి.రావు చేస్తున్న పోరాటాలకు బాసట నిలిచిన మాట అక్షర సత్య మన్నారు. మాలమహనాడు వ్యవస్థాన దాని నిర్మాణం, ఆశయాల సాధన కోసం తన జీవిత పర్యంతం నిరంతరం ప్రజల పక్షాన నిలిచిన పోరాడిన అలుపెరుగని జ్ఞాని,నిజమైన అంబేద్కర్ వాది పి.వి.రావు. ఆయన భౌతికంగా దేశ ప్రజలకు దూరమై నేటికి 17 సంవత్సరాలు. 22. 12. 2005.ఆయన అనుసరించిన విధానాల వల్ల ఎంతో మంది నాలాంటి నాయకులు స్ఫూర్తి పొందారు. ఈ కార్యక్రమం లో ఎస్.వాసు,టి అంజి, కుర్మయ్య, జ్ఞానేశ్వరి, చంద్రకళ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న బీజేపీ : సీపీఐ నేత కూనంనేని




వరంగల్, డిసెంబర్ 22: దేశంలో బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధి కన్నా మత ఉన్మాదాన్ని బీజేపీ పెంచుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. గురువారం హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి బీజేపీకి లేదని అన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ రాష్ట్రంలో వివిధ పట్టణాలకు ఉన్న పేర్లను మారుస్తామని అంటు న్నారని, ఆ పేర్ల వెనక ఎంతో చారిత్రాత్మకమైన నేపథ్యం ఆ ప్రాంత ప్రజల జీవన విధానం, సంస్కృతి మీద ఆధారపడి ఏర్పడినటువ ంటిదేనని, పట్టణాల పేర్లు వాటిని మారుస్తామనడం మూర్ఖత్వం అన్నారు. బండి సంజయ్ం, అమిత్ షా పేర్లు మారుస్తారా..వాళ్ళ అమ్మానాన్న పెట్టిన పేరును కూడా బండి సంజయ్ మార్చుకుంటాడా అని ప్రశ్నించారు. తెలుగు భాషా సంస్కృతి ప్రతిపాదికన ఏర్పడిన పేర్లే పట్టణాలకు పెట్టారని అన్నారు. గోద్రా మరణ హోమానికి గురైన బిల్కిస్ భానో వేసిన పిటిషన్ ను సుప్రీం కోర్టు కొట్టి వేయడం జరిగిందని, ఆ మారణ హోమంలో ఆమె తన సర్వస్వాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యున్నతమైన న్యాయస్థానం కూడా అలాంటి విషయాన్ని పట్టించుకోకుండా పిటిషన్ కొట్టివేయడం మూలంగా న్యాయం జరగకుండా పోయే పరిస్థితులు కనబడుతున్నాయని, న్యాయ వ్యవస్థను కూడా బిజెపి తన అధికార బలంతో కంట్రోల్ చేస్తుందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ అభివృద్ధి కన్నా మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి, దేశ ప్రజల మధ్య విభజన గీత గీసి తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి బీజేపీ ప్రయత్నాలు ముమ్మారంగా చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, రక్షణ రంగం, రైల్వే, విమానయాన, విద్యుత్ సంస్కరణల వంటి చర్యల ద్వారా కేవలం నాలుగు లక్షల కోట్ల కోసం ఆదాని, అంబానీలకు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టిందని అన్నారు. ఉచిత పథకాలను రద్దు చేద్దామనడం, పేదలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాయడమేనని, ప్రజల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి కాకులను కొట్టి గద్దలకు వేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బడా పెట్టుబడిదారులకు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపుగా 15 లక్షల కోట్ల రూపాయల బకాయిలు రద్దు చేసి ఆదాని, అంబానీలకు దేశ సంపదను కట్టబెట్టిందని అన్నారు. ఈ దేశానికి బిజెపి ప్రమాదకారిగా మారిందని అన్నారు. కరీంనగర్ పార్లమెంటు సభ్యులుగా గెలిచిన బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్లో పరిధిలో ఉన్నటువంటి గ్రామాల అభివృద్ధికి గానీ పట్టణాల అభివృద్ధికి గానీ కృషి చేయకుండా మత విద్వేషాలు రెచ్చగొట్టడం కొరకు మాత్రమే బండి తెలంగాణ రాష్ట్రంలో పర్యటిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన విభజన హామీలైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజ లను బిజెపి మోసం చేస్తుందని అన్నా రు. జీఎస్టీ పన్నుల వాటా 30 కోట్లు తెలంగాణకు ఇవ్వకుండా కేంద్ర ప్రభు త్వం ఆపిందని అన్నారు. కేంద్రం ప్రభుత్వం ఈడి, సిబిఐ పేరుతో దాడులు చేస్తూ ప్రజా ప్రతినిధుల పైన మానసిక దాడులకు సిద్ధమైందన్నారు. రైతుల, కార్మికుల, విద్యార్థి యువజన , పేదల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిరంతరం కొనసాగుతాయని అయినా అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కాలంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టించిన చరిత్ర గతంలో మనం చూశామని, తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలం ఇవ్వకుండా ఇండ్లు కట్టుకోవడం కొరకు మూడు లక్షల రూపాయలు ఇస్తామంటున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల స్థలాల కొరకు పోరాటాలు చేస్తున్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమిం చుకొని గుడిసెలు వేసుకున్న పేదలకు ఆ స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడం కొరకు ఐదు లక్షల రూపాయలు కూడా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అన్ని కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో , ఫామ్ హౌస్ లుగా వందలాది ఎకరాలు మారుతున్నాయని ఆయన అన్నారు. పేదలకు ఇండ్ల స్థలాల కోసం ఢిల్లీలో కూడా ఆందోళన ఉదృతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు,జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి,మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మారుపాక అనిల్ కుమార్, మంద సదా లక్ష్మి, జక్కు రాజు తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# పాలమూరు జిల్లాలో 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి భూమిపూజ



మహబూబ్‌నగర్, డిసెంబర్ 22: మహబూబ్ నగర్ జిల్లా పాత కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న 1000 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డితో కలిసి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాస్ గౌడ్ పట్టుబట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని జిల్లాకు తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన తొలి మెడికల్ కాలేజీ కూడా పాలమూరు జిల్లాకే వచ్చిందని మంత్రి గుర్తు చేశారు. జిల్లాలో పారామెడికల్ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించుకుందామని తెలిపారు. పాలమూరుపై ప్రతిపక్షాల నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అన్ని జిల్లా కేంద్రాల్లో వైద్యారోగ్య సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నామని, అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఈ భూమిపూజ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మా రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, దామోదర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇంతియాజ్, డీసీసీబీ చైర్మన్ నిజాం పాషా, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, వైద్య విద్య సంచాలకులు రమేష్ రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు, అడిషనల్ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు మన బడి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి- జిల్లా కలెక్టర్ ఎస్. కృష్ణ ఆదిత్య.



ములుగు ,డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో ఎంపిక చేయబడిన మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ కృష్ణ ఆదిత్య సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టర్ తన ఛాంబర్ లో సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతోసమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేయబడిన మన ఊరు మనబడి కార్యక్రమంలో మోడల్ పాఠశాలల రూపకల్పన కోసం విద్యా శాఖ, ఇంజనీరింగ్ శాఖతో అధికారులతో పనుల పురోగతిని తెలుసుకున్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి, ములుగు జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు, ఏటూరు నాగారం ఎప్ ఎల్ ఇంఛార్జి, విజయ్ సింహా రెడ్డి పెయింటింగ్ కాంట్రాక్టర్ మోహన్ రెడ్డి లకు మోడల్ పాఠశాలల పెయింటింగ్ పై పలు సూచనలు చేశారు. కాంట్రాక్టర్లు అధికారుల ఫోన్ కాల్స్ స్పందించాలని తెలిపారు. పనుల పురోగతిని వాట్సాప్ గ్రూప్ ద్వారా అప్లోడ్ చేస్తున్నారని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్ 10 జట్ల వర్కర్ల వివరాలను సమర్పించారు. పెయింట్ పని పురోగతి ఆన్లైన్ ద్వారాఏరోజుకారోజు అప్లోడ్ చేయాలి అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాఅధికారి జి పానిని, పంచాయతి రాజ్ డి ఈ రవీందర్, ఈడియం దేవేందర్ కాంట్రాక్టర్స్ విజయ్ సింహ రెడ్డి మోహన్ రె

# పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయాలి

## -జిల్లా ఓటరు రోల్ పరిశీలకులు శ్రీమతి భారతి నాయక్ .



ములుగు ,డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో ఓటర్ జాబితా కట్టుదిట్టంగా, పకడ్బందీగా రూపొందించాలనిజిల్లా ఓటరు రోల్ పరిశీలకులు శ్రీమతి భారతి నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం ములుగు తహసీల్దార్ కార్యాలయంనకు ఎలక్ట్రోరల్ రోల్ పరిశీలకులు పర్యటించి ఓటరు జాబితా రూపకల్పనను పరిశీలించారు.

అనంతరం ఆర్డిఓ రమాదేవి, తాహసిల్దార్ ఎం సత్యనారాయణస్వామి లతో ఓటరు జాబితా పై చర్చించారు

ఓటరు ఎలక్ట్రోరల్ రోల్ పరిశీలకులు శ్రీమతి భారతి నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కొరకు వచ్చిన దరఖాస్తులను డిసెంబర్ 26 లోపు పరిశీలించి డిస్పోజ్ చేయాలని, అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు.

జిల్లాలో ఉన్న డూప్లికేట్ ఓట్లు పూర్తి స్థాయిలో తోలగించాలని ఆమె సూచించారు.

రాష్ట్రంలో వచ్చే సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయని, అధిక సంఖ్యలో ఓటరు నమోదు ప్రక్రియ

జరిగే అవకాశం ఉందని, ప్రస్తుతం పకడ్బందీగా ఓటరు జాబితా సిద్ధం చేస్తే, ఎన్నికల సమయంలో ప్రక్రియ సజావుగా జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో ఉన్న జనాభాకు ఓటర్ల నిష్పత్తి, ఓటర్లలో జెండర్ నిష్పత్తి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఉండే విధంగా కృషి చేయాలని సూచించారు. ఓటరు నమోదు సమయంలో ట్రాన్స్ జెండర్లు, సెక్స్ వర్కర్లు వివిధ ప్రత్యేక వర్గాలతో సమావేశాలు నిర్వహించామని, వారందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాల నిండిన దివ్యాంగులందరికి ఓటు హక్కు కల్పించి, పోలింగ్ కేంద్రాల వారిగా మ్యాపింగ్ చేయాలని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 80, 90 సంవత్సరాల నిండిన ఓటర్ల వివరాలు క్షేత్రస్థాయిలో సదరు మరోసారి ధృవీకరించాలని ఆమె సూచించారు. ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ విజయ్ పాల్గొన్నారు.

# రైతు రాజ్యమే బీఆర్ఎస్ లక్ష్యం : మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి , డిసెంబర్ 22:రైతు రాజ్యమే భారత రాష్ట్ర సమితి లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు రాజ్యం కోసం దేశంలోని రైతులందరినీ ఏకం చేస్తామని పేర్కొన్నారు. అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్ నినాదం బీజేపీకి చెమటలు పట్టిస్తున్నదని మంత్రి అన్నారు. వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్ రెడ్డిని కర్ణాటక లోక్ జనశక్తి(పాశ్వాన్) రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జీ వెంకట్ రెడ్డి, ఎల్‌జేపీ కర్ణాటక యువజన అధ్యక్షులు నారాయణ కర్లి, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ కులకర్ణి, న్యాయవాది శేఖర్ గౌడ, గణేష్ యాదవ్ , వీరేష్ రెడ్డి, గణేష్ కలిసి బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపారు.

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ రైతు నినాదంపై చర్చ మొదలైందన్నారు. తెలంగాణ ఉద్యమం మొదలు పెట్టినప్పుడు మఖలో పుట్టి పుబ్బలో పోతుందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించాం.. ఈ ఎనిమిదేండ్లలో తెలంగాణ అభివృద్ధి దేశానికి ఆదర్శంగా నిలిపామన్నారు. కేసీఆర్ తెలంగాణ దాటితే తమ పునాదులు కదలడం ఖాయమని బీజేపీ భయపడుతున్నదని నిరంజన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తూ, నిధులకు మోకాలడ్డుతున్నదని మండిపడ్డారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా తెలంగాణ అభివృద్ధిని ఆపలేరని నిరంజన్ రెడ్డి తేల్చిచెప్పారు.

త్వరలో రాయిచూర్ వేదికగా పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరికలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని కర్ణాటక లోక్ జనశక్తి(పాశ్వాన్) రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జీ వెంకట్ రెడ్డికి సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తాను స్వయంగా హాజరవుతానని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు.

# రాజన్న ను దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సతీమణి అల్లోల విజయలక్ష్మిదర్శించుకున్నారు. రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వాదం ఇచ్చినఅంతరం ఆలయ ఈఓ కృష్ణప్రసాద్ లడ్డు ప్రసాదం అందజేశారు.వీరి వెంట ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్ ,ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు ఎడ్ల శివ ఉన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమం...



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు పట్టణ సి.ఐ. వెంకటేష్ ఆధ్వర్యంలో చెక్కపల్లి బస్టాండ్ వద్ద గురువారంట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్.ఐ. కె దిలీప్ కుమార్ విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడిపినట్లైతే ప్రాణాపాయం లేకుండా ప్రయాణం చేయవచ్చని, సెల్ ఫోన్ మాట్లాడుతూ బైక్ నడిపితే జరిగే పరిణామల గురించి విద్యార్థులకు వివరించారు,ట్రాఫిక్ రూల్స్ తప్పకుండ పాటించాలనే అంశం గురించి మద్యపానం తాగి నడిపితే కలిగే ఇబ్బందుల గురించి .మరియు మైనర్ పిల్లలకు బైక్ ఇచ్చినట్లయితే జరిగే ఇబ్బందుల గురించి తెలియజేశారు..అలాగేవిద్యార్థిని, విద్యార్థులు ట్రాఫిక్ గురించి ప్రదర్శించిన నాటిక వాహనాదారులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ఎం. శ్రీధర్, డైరెక్టర్ ఎం. శ్రీ విద్య , డి జి ఎం లక్ష్మణ్ రావు , ఆర్ ఐ ముద్రకోల రాజు, డీన్ పీ శేఖర్, ప్రైమరీ ఇంచార్జి సృజన, పీ పీ టి ఇంచార్జి మమత, ఏ ఓ సుధీర్, పీ ఈ టి సుధాకర్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు చెక్కులను అందజేసిన ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్యాక్స్ కార్యలయంలో ,ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి ,డైరెక్టర్ లతో కలిసి,11 మంది రైతులకు 50 లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల కోసమే సహకార సంఘాలు పని చేస్తున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ,రైతులు,తదితరులు ఉన్నారు.

# టర్నింగ్ మైండ్స్ ఏర్పాటుకు 30 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టిన అప్‌గ్రాడ్

హైదరాబాద్, డిసెంబర్ 22: ఆసియాలో అతిపెద్ద ఉన్నత ఎడ్‌టెక్ కంపెనీ అప్‌గ్రాడ్ మరో మైలురాయిని తమ బ్రాండ్ టర్నింగ్ మైండ్స్ ద్వారా ఉత్పత్తి విభాగంలో చేరుకుంది. దాదాపు 150 మందికి పైగా ఫుల్ టైమ్ ఫ్యాకల్టీ (94% మంది పీహెచ్‌డీలు)తో అప్‌గ్రాడ్ ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన విభాగాలైనటువంటి ఏఐ, ఎంఎల్‌లో అత్యంత శక్తివంతంగా నిలిచింది. టర్నింగ్ మైండ్స్‌ను గత సంవత్సరం ఏర్పాటుచేశారు. దీనికి ఔట్‌సోర్స్డ్ పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధి కోసం వ్యాపార సంస్థల నుంచి అపూర్వ స్పందన లభించింది. "ఓ ఆలోచన తీసుకుని, వేగవంతంగా ప్రోటోటైప్స్ మరియు యాక్సలరేటర్స్ (యాప్స్) తయారుచేయడంలో ప్రత్యేకత కలిగిన టర్నింగ్ మైండ్స్ , వాటిని పరిశ్రమతో పరిశీలించడంతో పాటుగా మెరుగైన అంశాలను ఎంచుకుంటుంది" అని టర్నింగ్ మైండ్స్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అనురాధ శర్మ అన్నారు. "అంతర్జాతీయంగా పరిశ్రమల నుంచి అపూర్వ స్పందనను అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విభాగాలైనటువంటి ఏఐ మరియు ఎంఎల్‌లో ప్రపంచ శ్రేణి ఉత్పత్తులు, సేవల పరంగా చూస్తున్నాము" అని అనురాధ అన్నారు.దాదాపు 30 కోట్ల రూపాయల అప్‌గ్రాడ్ పెట్టుబడులతో టర్నింగ్‌మైండ్స్ ప్రస్తుతం యుఎస్, ఇండియా, యూరోప్, యుకె, మిడిల్ ఈస్ట్‌లలో 15కు పైగా ఆఫ్‌లైన్ సదుపాయాలలో కార్యకలాపాలు నిర్వహిస్తుంది. హైదరాబాద్, బెంగళూరు మరియు డెట్రాయిట్‌లలోని వీరి కార్యాలయాల్లో 250కు పైగా ప్రొడక్ట్ ఇంజినీర్లు పనిచేస్తున్నారు. టర్నింగ్ మైండ్స్ ప్రస్తుతం భారతదేశంలో సీనియర్ డాటా సైంటిస్ట్‌లు, ఎంఎల్ ఇంజినీర్స్ ను క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా చేసుకుంటుంది. దీని గురించి ప్రొఫెసర్ అనురాధ మాట్లాడుతూ " మా టీమ్‌లు 50 ప్రోటోటైప్స్‌ను ఇన్‌క్యుబేట్ చేసేందుకు పని చేస్తున్నాయి. రాబోయే 8?10నెలల్లో 8?10 పేటెంట్స్‌ను చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు మద్దతు అందించేందుకు ఫైల్ చేయనున్నాము" అని అన్నారు.యుజీడీఎక్స్ సీఈఓ డాక్టర్ దక్షిణామూర్తి వి కొల్లూరు మాట్లాడుతూ "పరిశ్రమ లక్షిత విద్యావేత్తలు నేరుగా కార్పోరేట్స్‌తో కలిసి పనిచేయడంతో పాటుగా వారికి వ్యాపార సంసిద్ధత ఉత్పత్తులను సృష్టించడంపై పనిచేసే అవకాశం కలుగుతుంది" అని అన్నారు.

# వేములవాడలో ప్రగతిలో ఉన్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**-సర్వాంగ సుందరంగా మూలవాగు బండ్ ను తీర్చిదిద్దాలి**
**-వెజ్ మార్కెట్, బస్తీ దవాఖాన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**
**-మహాశివరాత్రికి భక్తులు నూతన అనుభూతి పొందేలా ఏర్పాట్లు చేయాలి**
**-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ప్రగతిలో ఉన్న పలు అభివృద్ధి పనుల పురోగతిలో వేగం పెంచి, మహాశివరాత్రి జాతర కల్లా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులు నూతన అనుభూతిని పొందేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.

గురువారం ఆయన వేములవాడ పట్టణంలో సుడిగాలి పర్యటన చేసి, పట్టణంలో ప్రగతిలో ఉన్న పలు అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ముందుగా నంది కమాన్ జంక్షన్ ను పరిశీలించి, జంక్షన్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. జంక్షన్ నుండి వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి వరకు రహదారికి ఇరువైపులా మల్టీ లేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ను ఆదేశించారు. అనంతరం మూలవాగు బండ్ సుందరీకరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. 63 లక్షల రూపాయలతో, 4 మీటర్ల వెడల్పుతో, బ్రిడ్జ్ మొదలు నుండి బస్టాండ్ వెనక వైపు 210 మీటర్లు, బ్రిడ్జ్ చివర నుండి వైకుంతధామం వైపు 330 మీటర్ల బండ్ ను నిర్మిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రజలు ఆహ్లాదకర వాతావరణాన్ని పొందేలా, వాకింగ్ ట్రాక్, గ్రాస్, బెంచ్ లు, చెట్లు, ఫెన్సింగ్ తో సర్వాంగ సుందరంగా మూలవాగు బండ్ ను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే సంక్రాంతి వరకు ఈ సుందరీకరణ పనులు పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అమరేందర్ రెడ్డి ని కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ చామకుంట వద్ద 2 కోట్ల 71 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న వెజ్ మార్కెట్ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని, సంక్రాంతి వరకు నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

తదనంతరం లక్ష్మీగణపతి కాంప్లెక్స్ లోని గ్రౌండ్ ఫ్లోర్ లో చేపడుతున్న బస్తీ దవాఖాన నిర్మాణం పనులను పరిశీలించారు. పట్టణ ప్రజలు, ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 13 లక్షల రూపాయలతో ఈ బస్తీ దవాఖనను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అన్ని సౌకర్యాలతో త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఆలయం ముందు ఉన్న రోడ్ కు ఇరువైపులా ఫుట్ పాత్ లు నిర్మించే అంశంపై మున్సిపల్, ఆలయ అధికారులతో కలెక్టర్ చర్చించారు.

చివరగా కలెక్టర్ ఆలయంలోని ధర్మగుండం, కళ్యాణకట్ట ను పరిశీలించారు. మహాశివరాత్రికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులను ఆదేశించారు.

ధార్మిక క్షేత్రానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సైనేజ్ బోర్డులను ఏర్పాటు చేయాలని, తెలంగాణ తల్లి జంక్షన్ ను మోడల్ గా తీర్చిదిద్దాలని, మూలవాగు వద్ద ఉన్న ఓపెన్ జిమ్ కు పెయింటింగ్ వేయాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

భీమేశ్వర ఆలయం సమీపంలో గల నటరాజ్ విగ్రహానికి పెయింటింగ్ వేయాలని, నందీశ్వర కాంప్లెక్స్ లో భక్తులు బోనాలు వండుకోవడానికి గదుల్లో కాకుండా వేరుగా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు.

**నాలుగు గంటల పాటు కలెక్టర్ సుదీర్ఘ పర్యటన, క్షేత్ర పనుల పరిశీలన**

వేములవాడ పట్టణంలో సుమారు నాలుగు గంటల పాటు జిల్లా కలెక్టర్ సుదీర్ఘ పర్యటన చేసి, అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వచ్చే మహాశివరాత్రి కల్లా వేములవాడ పట్టణాన్ని కొత్తగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంలో ఆర్డీఓ పవన్ కుమార్, నీటి పారుదల శాఖ ఈఈ అమరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఈఓ కృష్ణప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ అప్పయ్య గారి సొంత ఖర్చులతో టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్ల అందజేత



ములుగు జిల్లాలో గౌరవ వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు తన్నీరు హరీష్ రావు గారి పిలుపుమేరకు టీబీ రోగులకు భరోసా,నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా డాక్టర్ అప్పయ్య తన సొంత ఖర్చులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 22. 11. 2022 రోజున ఆరుగురు టీ బి పేషెంట్స్ కి అదనపు పోషకాహారము పాకెట్స్ ఇచ్చిన దానికి కొనసాగింపుగా ఈ రెండవ నెలలో కూడా పోషకాహార ప్యాకెట్లను ఃః రోగులకు అందజేయడం జరిగింది.

ఆరుగురు టీబి రోగులకు గాను ఈరోజు ఇద్దరూ ప్రత్యక్షంగా వచ్చి తీసుకోవడం జరిగింది.

మిగతా వారికి ఆశ కార్యకర్తల ద్వారా ఈ పోషకాహార కిట్లు అందజేయాలని ఆశలను ఆదేశించడం జరిగింది.

ఈ న్యూట్రిషన్ కిట్ ద్వారా ః రోగికి పోషకాహారము, తనకు అవసరమైన మాంసకృత్తులు, అందజేయబడతాయి. తద్వారా క్షయ వ్యాధి త్వరగా నయమవుటకు ఈ కిట్టు దోహదపడుతుంది.

**ఈ యొక్క న్యూట్రిషన్ కిట్ లో ఉండే వస్తువుల వివరాలు.**

1. 30 కోడిగుడ్లు
2. ఒక కిలో నూనె
3. రెండు కిలోల పప్పు
4. 5 కిలోల బియ్యం

ఇవి అయిపోయిన అనంతరము మళ్లీ వారికి ఇదే రకమైన కిట్టు అందజేయబడుతుంది.

ఇలా వారికి ఆరు నెలల పాటు అందజేయబడుతుంది. ఈ కార్యక్రమంలో డిపిపిఎం సమ్మయ్య, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణం కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ప్రముఖ గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు గణితానికి సంబంధించిన వివిధ మోడల్ లను తయారుచేసి ప్రదర్శించారు. మరియు శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర పై చేసిన నాటిక, నృత్యాలు, వివిధ గణిత ఆకృతులతో చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రకాల గణిత సమస్యలను పరిష్కరించడం నిరంతరం సాధన చేయాలని ,ప్రతీ విషయం పై సమగ్ర అవగాహన తెచ్చుకొని భవిష్యత్తులో గొప్ప గణిత ఆవిష్కరణలు చేసి మనదేశానికి గొప్పతనం నలుదిశలా ప్రసరింప చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ, ప్రధాన ఉపాధ్యాయులు కళ్యాణ్ కుమార్ గణిత ఉపాధ్యాయులకు , విద్యార్థులకు గణితదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరెస్పాండెంట్ బహుమతులను ప్రధానం చేశారు.ఉ ఎా ద.ా య ఁ ఽ ఽ ల ఽ , విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బొజ్జ భారతి గెలిపించాలంటూ ఇంటింటా ప్రచారం



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): సెస్ ఎన్నికల్లో భాగంగాతిప్పాపురంలో సౌరాల కాలనీ రెడ్డి కాలనీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బొజ్జ భారతికి టార్చ్ లైట్ పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ సెస్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ బిజెపి పార్టీ డబ్బు ప్రభావంతో ఓటర్లు కొనాలని చూస్తుందని ఆ డబ్బు మనదే అని డబ్బు తీసుకొని నిజాయితీగల రైతు బిడ్డకు బొజ్జ భారత్ కి టార్చిలైట్ పై ఓటు వేసి గెలిపించాలని అన్నారు. టిఆర్ఎస్ గెలిస్తే విద్యుత్ చార్జీలు ఇంకా అధికంగా పెరుగుతాయని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే 100 కోట్ల కుంభకోణాన్ని బయటకి తీస్తామని బిల్లు చార్జీలు తగ్గించాలంటూ పోరాడుతున్నామని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని వేములవాడ రెండు బైపాసు ఓల్డ్ అర్బన్ కాలనీ ఇల్లు కాంగ్రెస్ ఇచ్చిన ఘనత అని, టిఆర్ఎస్ బిజెపిని చిత్తుగా ఓడించాలని అన్నారు.

ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం రేణుక, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, నాగుల మహేష్ గౌడ్, నాగుల విష్ణు, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

# శబరి గిరీశుని సేవలో పొంగులేటి సోదరులు



ఖమ్మం, డిసెంబర్ 22 (నేటినిజం ప్రతినిధి) :హరిహరసుతుడు... శబరి గిరీశుడు... పంబావాసుడు... శ్రీ అయ్యప్పస్వామి వారి సేవలో ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొంగులేటి ప్రసాదరెడ్డి సోదరులు గడిపారు. కాలినడకన శబరి కొండపైకి చేరుకుని శ్రీ మణికంఠుడిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ శబరీశుని కరుణాకటాక్షలు ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజానీకంపై ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. ఈ పర్యటనలో వారి వెంట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోరం కనకయ్య, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, రామసహాయం నరేష్ రెడ్డి, జారె ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

# పదమూడవ రోజు హాజరైన 1025 మంది పురుష అభ్యర్థులు

**- తుది పరిక్షలకు అర్హత సాధించిన 527 మంది అభ్యర్థులు**



ఖమ్మం, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్స్, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా బుధవారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 1025 మంది హాజరైయ్యారని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. ఇందులో 527 మంది అభ్యర్థులు తుది పరిక్షలకు అర్హత సాధించారని తెలిపారు. గురువారం మొత్తం 1211 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 1025 మంది హాజరై ఈవెంట్లలో పాల్గొన్నారని తెలిపారు. అనారోగ్య సమస్యలతో దేహదారుఢ్య పరీక్షలలో పాల్గొనే పరిస్థితులు లేవని అభ్యర్థులు చేసుకుంటున్న దరఖాస్తులను డాక్టర్ జితేందర్ ఆధ్వర్యంలో వైద్యుల బృందం పరిశీలించి సమస్య తీవ్రతను బట్టి ఎన్ని రోజులు విశ్రాంతి అవసరమనే విషయాన్ని పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డుకు నివేదిస్తారని తెలిపారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ షెడ్యూల్ విడుదల.. పరీక్ష ఎప్పుడంటే..?

న్యూఢిల్లీ, డిసెంబర్ 22: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష షెడ్యూల్ గురువారం విడుదలైంది. గువాహటి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ షెడ్యూల్‌ను ప్రకటించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను వచ్చే ఏడాది జూన్ 4న నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఏప్రిల్ 30న రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నట్లు నోటిఫికేషన్‌లో తెలిపింది. అభ్యర్థులు మే 5వ తేదీలో ఫీజు చెల్లించాలని పేర్కొంది. మే 29 నుంచి జూన్ 4 వరకు అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పింది. పూర్తి వివరాలకు తీవవజీటల.జీఇ.తిని వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించింది.

**IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM-I ADDL. CHIEF JUDGE: C.C.C. AT SECUNDERABD O.P.NO 475 of 2021**

Between;
Mr. Koma Babu rao
...Petitioner.
AND
Mr. B. Anil & Others
…Respondents.

TO.
R-1,Mr. B. Anil
S/o.B. Mosha
@ Basha, Aged about: Major,
Occ:Car Driver,
(Driver of Crime Vehicle)
R/o. H.No.4-1-216/7/1,
Karthikeya Nagar,
Habsiguda, Uppal,
Medchal,
T.S-500 007

**NOTICE**

Please take notice that in the above matter the Petitioner had filed a case against you (Respondent No.1) for compensation for Rs. 2,00,000/- and the same is posted for your appearance on **27-12-2022.**

You are advised to appear on **27-12-2022** at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

( By the order of the court )

**M/s. B. NAGA RAJU YADAV**
**BANDI KALAVATHI**
**GODUGU KRISHNA**
Advocates
#H.No.3-12-126/1/405,
P.S. Residency,
P.S. Colony,
Ramanthapur,
Amberpet
Hyderabad-13.
Cell: 7675975689
9959858035

## ఆరు సంవత్సరాల విరామం తర్వాత, ఈ ఈవెంట్‌లో నాణ్యమైన సందర్శకుల ప్రవాహం నమోదు

హైదరాబాద్, డిసెంబర్ 22: 22 డిసెంబర్ 2022, దీపం వెలిగించడం, గణేష్ వందన, జాతీయ గీతం వంటి భారతీయ సంప్రదాయానికి అనుగుణంగా ఈవెంట్ ప్రారంభించబడింది, ఎస్. హరి శంకర్, ఇండియా ఇట్మి సొసైటీ చైర్మన్, కేతన్ సంఘ్వి, గౌరవనీయులు. కోశాధికారి, సంజయ్ జయవర్ధనవేలు, చైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్, లక్ష్మీ మెషిన్ వర్క్స్ లిమిటెడ్ మరియు గత చైర్మన్, శ్రీ సంజీవ్ లాథియా, గత చైర్మన్ శ్రీ అనూజ్ భగవతి, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, రాకేష్ కుమార్, ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్ లిమిటెడ్ చైర్మన్ సాధారణ వేడుకలో పాల్గొన్న ఇతర ప్రముఖులతో పాటు.భారతదేశం యొక్క డిజిటల్ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, భారతదేశ ఇట్మి ఈవెంట్ యొక్క ఈ ఎడిషన్ తన సేవలన్నింటినీ డిజిటలైజ్ చేసింది మరియు ఈవెంట్ కేటలాగ్‌లు, విజిటర్ గైడ్, హెల్ప్ డెస్క్ అసిస్టెన్స్, ఎగ్జిబిటర్ మాన్యువల్ మొదలైన వాటిని డిజిటల్‌గా ప్రింట్ యాక్టివిటీని తగ్గించి తద్వారా పేపర్ వినియోగాన్ని ఆదా చేసింది.ఇతర సవాళ్ల మధ్య భౌగోళిక-రాజకీయ అల్లకల్లోలం ఎదుర్కొంటున్న పరిశ్రమలో చైతన్యాన్ని నింపుతూ, దానిలో పాల్గొనే వారందరినీ శక్తివంతం చేసే ఉత్సాహంతో మెగా ఈవెంట్ ముగిసింది.

## రెండు రాష్ట్రాలను కలపాలని చూస్తున్నారు.. మంత్రి గంగుల ధ్వజం

కరీంనగర్, డిసెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వైఎస్ బిడ్డ వెరైటీ ముసుగుతో ఇక్కడకొచ్చిందని, పవన్ కల్యాణ్, కేఏ పాల్ కూడా వచ్చారని, తెలంగాణ సంపదపై వీరంతా కన్నేశారని మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. కరీంనగర్ లో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పుడు అసలు మనిషి చంద్రబాబు ఎంటరయ్యాడని, పాత బిడ్డల్లారా రండి అంటున్నడని, డిఫరెంట్ వేషాల్లో వీళ్లంతా వచ్చినా అందరు ఒకటేనన్నారు. మళ్లీ రాష్ట్రాన్ని కలపాలన్నదే వీరి ఎజెండా అన్నారు. మళ్లీ 1956 నవంబర్ 1 గుర్తుకు తెస్తున్నారని, ఆ ప్రయత్నంలో భాగమే చంద్రబాబు ఎంట్రీ అన్నారు. మీ మూలాలు ఎక్కడ? ఏపీ మూలాలున్న మీకు తెలంగాణ గడ్డపై ఏం పని అని ధ్వజమెత్తారు. రెండు రాష్ట్రాలు జూన్ 2నే ఏర్పడినా చంద్రబాబు ఆరోజు ప్రమాణం చేయలేదని గుర్తు చేశారు. ఖమ్మం నుంచి ఏడు మండలాలు కలిపేదాకా ప్రమాణం చేయనన్న వ్యక్తి చంద్రబాబు అన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.